వంతెన నిర్మాణమెప్పుడో?

- ఆరు నెలల క్రితం స్తంభంపల్లి గంజివాగు వద్ద హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన
- రూ.1.80కోట్ల నిధులు మంజూరు
- ఇంకా మొదలుకాని పనులు
- ఏటా వర్షాకాలంలో వాహనదారుల తిప్పలు


స్తంభంపల్లి గంజివాగు వద్ద లోలెవల్ కల్వర్టు

బోయినపల్లి(చొప్పదండి): మండలంలోని స్తంభంపల్లి గంజివాగు వద్ద హైలెవల్ వంతెన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి ఆరు నెలలు గడుస్తున్నా నేటికీ బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు. ఏటా వర్షాకాలంలో స్తంభంపల్లి గంజివాగుపై వరద నీరుతో వేములవాడకు రాకపోకలు నిలిచిపోవడంతో ఏళ్లుగా వావానదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ హైలెవల్ బ్రిడ్జి నిర్మించాలని సాక్షిలో పలుసార్లు వరుస కథనాలు వచ్చాయి. ఈమేరకు లో లెవల్ కల్వర్టు స్థానంలో హైలెవల్ బ్రిడ్జి నిర్మించేందుకు అప్పటి ప్రభుత్వం రూ.1.80 కోట్లు మంజూరు చేసింది. గతేడాది ఆగస్టు 28న బ్రిడ్జి నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం, అధికారుల అలసత్వంతో ఆరునెలలైనా పనులు ప్రారంభంకావడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఏళ్లుగా తిప్పలు

బోయినపల్లి నుంచి వేములవాడకు వెళ్లాలంటే స్తంభంపల్లి గంజివాగు కల్వర్టుపై నుంచి వెళ్లాలి. నాలుగేళ్లుగా వర్షాకాలంలో గంజివాగు వరద ఉధృతితో లో లెవల్ కల్వర్టుపై పెద్దఎత్తున వరదనీరు ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోతున్నాయి. నాలుగేళ్ల క్రితం స్తంభంపల్లికి చెందిన ఓవ్యక్తి వేములవాడకు సైకిల్‌పై వెళ్తుండగా గంజివాగు వరదలో కొద్ది దూరం కొట్టుకుపోయాడు. చివరకు ఓ కొమ్మను పట్టుకోవడంతో స్థానికులు తాళ్లతో లాగి బయటకు తీశారు. స్తంభంపల్లి గ్రామ పంచాయతీ పోలీస్, రెవెన్యూ సిబ్బంది కల్వర్టు వద్ద రాకపోకలు నిలిపివేసేందుకు ఇబ్బందులు పడుతున్నారు.

గతేడాది నిధులు మంజూరు

స్తంభంపల్లిలో హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం కోసం ప్రభుత్వం గతేడాది ఆగస్టులో రూ.1.80కోట్ల అంచనాలతో నిధులు మంజూరు చేసింది. ఇంజినీరింగ్ అధికారులు పనులకు సంబంధించిన టెండర్ ప్రక్రియ పూర్తిచేసి కాంట్రాక్టర్‌తో అగ్రిమెంట్ చేయించుకున్నారు. గత ఆగస్టు 28న అప్పటి ఎమ్మెల్యే పనులకు శంకుస్థాపన చేశారు. అయినా ఇప్పటివరకు పనులు ప్రారంభం కావడం లేదు.

వర్షాకాలంలో ఇబ్బందులు



ప్రతి వర్షాకాలంలో స్తంభంపల్లి గంజివాగు కల్వర్టు మీదుగా వరద ప్రవాహానికి వాహనాల రాకపోకలు నిలుస్తున్నాయి. గ్రామం నుంచి ప్రతీరోజూ వివిధ పనుల నిమిత్తం ప్రజలు వేములవాడకు వెళ్తారు. దీంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. త్వరగా బ్రిడ్జి పనులు ప్రారంభించి ఇబ్బందులు తొలగించాలి.

– బొంగాని మల్లేశం, స్తంభంపల్లి

రాకపోకలు బంద్



బోయినపల్లి నుంచి వేములవాడకు, వేములవాడ నుంచి గంగాధర వెళ్లాలన్నా స్తంభంపల్లి గంజివాగు కల్వర్టు దాటాలి. వానాకాలంలో కల్వర్టు మీదుగా భారీగా వరదనీరు వెళ్తోంది. వేములవాడ, బోయినపల్లి మీదుగా వాహనాల రాకపోకలు నిలిపివేస్తున్నారు. త్వరగా హైలెవల్ కల్వర్టు నిర్మించాలి.

– నల్లగొండ అనిల్‌కుమార్, బోయినపల్లి

పది రోజుల్లో పనులు ప్రారంభం



స్తంభంపల్లి గంజివాగుపై హైలెవల్ వంతెన నిర్మాణ పనులు మరో పది రోజుల్లో ప్రారంభమవుతాయి. కాంట్రాక్టర్‌తో మాట్లాడి బ్రిడ్జి పనులు త్వరగా ప్రారంభించాలని ఆదేశించాం. పనులకు సంబంధించిన సామగ్రి తయారు చేసి పనులు చేపడుతాం.

– కె.విష్ణువర్ధన్, ఏఈ, పీఆర్, బోయినపల్లి

రుద్రవరంలో గౌతమ బుద్ధుడు



వేములవాడఅర్బన్: రుద్రవరం గ్రామంలోని మాల సంఘం ఆధ్వర్యంలో గౌతమ బుద్ధుడు విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. గ్రామ పంచాయతీ స్థలంలో సుమారు 5 గుంటల్లో చుట్టూ ప్రహరీ బెస్‌మెంట్ నిర్మాణం చేసి అందులో మొక్కలను నాటారు. రామడుగు మండల కేంద్రంలో బుద్ధుడి విగ్రహాన్ని రూ.75,000తో కొనుగోలు చేసినట్లు తెలిపారు. జనవరి 21న విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతంలో ఎక్కడ కూడా బుద్ధుడి విగ్రహం లేకపోవడంతో అందరూ వారిని అభినందిస్తున్నారు. గ్రామాల్లో కుల దేవతలకు సంబంధించిన దేవాలయాలు ఏర్పాటు చేసుకునే ఈ రోజుల్లో.. ఇలాంటి మహనీయుల విగ్రహాలను కూడా ఏర్పాటు చేయడంతో చుట్టుపక్కల గ్రామాల వారు కూడా ఇలాంటి ఆలోచన చేస్తున్నారు. గ్రామాల్లో దేవాలయాలు, భక్తితో పాటు ఇలాంటి మహనీయుల విగ్రహాలను కూడా ఏర్పాటు చేస్తే బాగుంటుందనే ఆలోచనతో ఏర్పాటు చేశామని ఆ గ్రామ యువత అంటోంది.

అనుచిత వ్యాఖ్యలు మాని అభివృద్ధికి సహకరించండి


కోనరావుపేటలో మాట్లాడుతున్న నాయకులు

కోనరావుపేట: కాంగ్రెస్ ప్రభుత్వం, మంత్రులపై అనుచిత వ్యాఖ్యలు మాని అభివృద్ధికి సహకరించాలని వేములవాడ నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు ధర్మపురి శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. బీఆర్‌ఎస్ నాయకులు, కేటీఆర్ సీఎం, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. జిల్లా కార్యదర్శి నాగండ్ల భూమేశ్, మీడియా కోఆర్డినేటర్ బండి పోలు, రాజూరి వెంకటేశ్, అనిల్, వేణు, కిరణ్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

శోచనీయం

సిరిసిల్లటౌన్: మంత్రి పొన్నం ప్రభాకర్‌పై బీఆర్‌ఎస్ నేతలు కొందరు ఆరోపణలు చేయడం శోచనీయమని కాంగ్రెస్ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం విలేకరులతో మాట్లాడారు. జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, వైద్య శివప్రసాద్, మ్యాన ప్రసాద్ తదితరులున్నారు.

పొన్నంపై తప్పుడు ప్రచారం

బోయినపల్లి: రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ బీసీ సామాజిక వర్గం వ్యక్తి కావడంతో సామజిక మాధ్యమాల్లో ఆయనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని, ఇది సరికాదని మండల జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పులి లక్ష్మిపతి పేర్కొన్నారు. గురువారం సాయంత్రం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. బీసీ వర్గం నుంచి పొన్నం మంత్రి కావడం జీర్ణించుకోలేక అసత్య ప్రచారం చేస్తే వారిని ప్రజలు క్షమించరని అన్నారు.

వైరల్ చేయడం సరికాదు

ఎల్లారెడ్డిపేట: మంత్రి పొన్నం ప్రభాకర్‌పై వీడియోను బీఆర్‌ఎస్ నాయకులు వైరల్ చేయడం సరికాదని కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి వంగ గిరిధర్‌రెడ్డి అన్నారు. ఎల్లారెడ్డిపేట పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. సిరిసిల్ల జిల్లాలో మొదటిసారిగా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించడానికి వచ్చిన సందర్భంలో పొన్నంను కార్యకర్తలు, నాయకులు సన్మానించడానికి ఉత్సాహంగా స్టేజీ పైకి పెద్దసంఖ్యలో తరలిరాగా.. వారిని స్టేజీ కిందకు దించే ప్రయత్నం చేశారన్నారు.

క్లుప్తంగా

పెద్ద కాలువకు తూములు ఏర్పాటు చేయాలి

గంభీరావుపేట: నర్మాల ఎగువ మానేరు ప్రాజెక్టు పరివాహక నీటి కోసం ఏర్పాటు చేసిన పెద్ద కాలువకు ప్రత్యేకంగా తూములు ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ మండల అధికార ప్రతినిధి మల్యాల రాజవీర్ ప్రభుత్వాన్ని కోరారు. ప్రాజెక్టు కింద వరి నాట్లు ముగుస్తున్నా.. పెద్ద కాలువలోని నీరు రాలేదని, దీంతో 1,400 ఎకరాల భూముల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారిందన్నారు. ప్రాజెక్టు సమీపం నుంచి సింగ సముద్రం వరకు పెద్ద కాలువ పారకం ఉందని, జాలునీరు ఆధారంగా కాలువ పారి పంటలు పండేవని అన్నారు. ప్రస్తుతం జాలు రాకపోవడంతో పెద్ద కాలువలో నీరు లేదన్నారు. ఇరిగేషన్ శాఖ అధికారులు స్పందించి కాలువ కింద వ్యవసాయ భూముల కోసం కేతమ్మ బండ వద్ద తూములు ఏర్పాటు చేసి ప్రాజెక్టు నీటిని అందించాలని కోరారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడికి సన్మానం



బోయినపల్లి: బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా మూడోసారి ఎన్నికైన ప్రతాప రామకృష్ణను వేములవాడలో గురువారం మండల నాయకులు కలిశారు. అభినందనలు తెలిపి సన్మానించారు. మండల అధ్యక్షుడు గుడి రవీందర్‌రెడ్డి, నాయకులు ఉదారి నర్సింహాచారి, జనగం లక్ష్మణ్, కొండం శ్రీనివాసరెడ్డి, బోగోజి గంగాధర్‌చారి, సారంపల్లి రాజు, ఇల్లెందుల బాలయ్య, రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తాటిచెట్టు పైనుంచి పడి వ్యక్తి మృతి


నర్సయ్య(ఫైల్)

వేములవాడరూరల్: వేములవాడరూరల్ మండలం మల్లారంలోని రాజనగర్‌కు చెందిన గీత కార్మికుడు నాగుల నర్సయ్య(50) ప్రమాదవశాత్తు తాటి చెట్టు పైనుంచి కిందపడి అక్కడికక్కడే మృతిచెందాడు. రోజు మాదిరిగానే కల్లు గీయడానికి వెళ్లిన నర్సయ్య ప్రమాదవశాత్తు చెట్టు పై నుంచి కిందపడి మృతిచెందినట్లు పేర్కొన్నారు. నర్సయ్య మృతితో గ్రామంలో విషాదం నెలకొంది.

గంజాయి కేసులో నలుగురు రిమాండ్

వేములవాడరూరల్: వేములవాడరూరల్ మండల పరిధిలోని నాగాయపల్లిలో గంజాయి కలిగిన నలుగురిని రిమాండ్‌కు తరలించినట్టు వేములవాడరూరల్ ఎస్సై మారుతి తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు. మండలంలోని స్తంభంపల్లికి చెందిన సాయికుమార్, చింతల్ ఠాణాకు చెందిన ప్రేమ్‌కుమార్, చీర్లవంచకు చెందిన రాజ్‌కుమార్, అనుపురం గ్రామానికి చెందిన రమేశ్ వద్ద గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు.

గ్రంథాలయం ప్రారంభం


గ్రంథాలయం ప్రారంభిస్తున్న మధు

తంగళ్లపల్లి: జిల్లెల్ల పాత గ్రామ పంచాయతీలో గురువారం గ్రంథాలయాన్ని సర్పంచుల ఫోరం జిల్లా అధ్యక్షుడు మాట్ల మధు గ్రామస్తులతో కలిసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. గ్రామంలోని యువత, విద్యార్థులు గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నేరెళ్ల సింగిల్‌విండో చైర్మన్ కోడూరి భాస్కర్, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు కొమ్మిటి రాజిరెడ్డి, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సంఘ భవనాలు ప్రారంభం


మహిళా సంఘ భవనం ప్రారంభిస్తున్న ఎంపీపీ

వేములవాడరూరల్: ఎదురుగట్ల గ్రామంలో మహిళా సంఘ భవనంతో పాటు ఇతర కుల సంఘాల భవనాలను ఎంపీపీ బండ మల్లేశం ప్రారంభించారు. సర్పంచుల పదవీకాలం గురువారంతో ముగియనుండడంతో చివరిరోజు వారు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు నెల రోజుల్లోపు మహిళా సంఘ భవనం ప్రారంభించుకోవడంతో మహిళలు సంతోషం వ్యక్తం చేశారు. సర్పంచ్ సోయినేని కరుణాకర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వకుళాభరణం శ్రీనివాస్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సోయినేని లహరి, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ వెలుమ బాల్‌రెడ్డి, ఎంపీటీసీలు చెన్నాడి శ్యామల, వెలుమ నర్సవ్వ, సెక్రటరీ శ్యామల, ఐకేపీ ఏపీఎం చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

వేములవాడకు నిధులు కేటాయించడం అభినందనీయం

- బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సాగారం వెంకటస్వామి


మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

వేములవాడ: రాజన్న భక్తులకు సౌకర్యాలు, పట్టణాభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి నిధులు మంజూరు చేయడంపై బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సాగారం వెంకటస్వామి హర్షం వ్యక్తం చేశారు. పట్టణంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. రూ.20కోట్లు వేములవాడకు కేటాయించడం అభినందనీయమన్నారు. గత ప్రభుత్వంలో వీటీడీఏ సమావేశం ఒక్కసారైనా నిర్వహించలేదన్నారు. వేములవాడ రోడ్ల విస్తరణ, బ్రిడ్జి నిర్మాణానికి మరో రూ.35 కోట్లు విడుదల చేస్తామని ప్రకటించడం హర్షనీయమన్నారు. జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి కూరగాయల కొమురయ్య, బీసీ సెల్ టౌన్ ప్రెసిడెంట్ నాగుల రాముగౌడ్, పట్టణ ఉపాధ్యక్షుడు నేరెళ్ల శ్రీధర్‌గౌడ్, నాయకులు కూర దేవయ్య, దాడి మల్లేశం, గంటల ప్రకాశ్, షేక్ ఫిరోజ్, సిరిగిరి శ్రీకాంత్, గుర్రం తిరుపతి, సారంపెల్లి భాను, సాయి తదితరులున్నారు.

రాజన్నకు కాసులపంట

- జనవరి నెలలో రూ. 11.43 కోట్ల ఆదాయం
- సమ్మక్క భక్తుల రాకతో పెరిగిన ఆదాయం


రాజన్న దర్శనం కోసం ఆలయంలో భక్తులు

వేములవాడ: సమ్మక్క జాతర భక్తుల రాకతో వేములవాడ రాజన్న ఆదాయం అమాంతం పెరిగింది. జనవరి నెలలోనే రూ.11.43 కోట్ల ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు. సమ్మక్క జాతరకు వెళ్లే భక్తులు ముందుగా తమ ఇలవేల్పు వేములవాడ రాజన్నను దర్శించుకుని వెళ్లే ఆచారం అనాదిగా వస్తోంది. ఈక్రమంలో జనవరిలో మహాజాతరను తలపించేలా భక్తులు తరలిరావడంతో ఎలాంటి ఆర్భాటాలు, ఖర్చు లేకుండా రాజన్నకు కాసులపంట పడింది. మహాశివరాత్రి జాతర పేరుతో రూ.కోటిన్నర వరకు, శివార్చనకు రూ.కోటి వరకు ఏటా ఖర్చు చేయడమే కాకుండా అధికారుల హడావుడి విపరీతంగా ఉండేది. ఎలాంటి బందోబస్తు కాని, స్పెషల్ అధికారుల పర్యటనలు, పరిశీలనలు లేకుండానే భక్తుల ద్వారా ఈ నెలలో అత్యధిక ఆదాయం వచ్చింది. ఎలాంటి అదనపు ఖర్చు లేకుండా జనవరిలో రూ.11.43 కోట్లు రాజన్న ఖాతాకు జమయ్యాయి.

ఆదాయం ఇలా..

హుండీ :	రూ.4 కోట్లు
కోడె మొక్కులు :	రూ.3.06 కోట్లు
ప్రసాదాలు :	రూ.2.10 కోట్లు
వసతి గదులు :	రూ.43.34 లక్షలు
దర్శనాలు :	రూ.39.70 లక్షలు
కల్యాణాలు :	రూ.32.11 లక్షలు
కల్యాణకట్ట :	రూ.26.29 లక్షలు
బద్దిపోచమ్మ :	రూ.19 లక్షలు
అభిషేకాలు :	రూ.13.20 లక్షలు
ఆర్జిత సేవలు :	రూ.12.98 లక్షలు
శాశ్వత పూజలు :	రూ.4.55 లక్షలు
ఇతరలు :	రూ.35.61 లక్షలు
మొత్తం :	రూ.11.43 కోట్లు

కార్యవర్గం ఎన్నిక


బోయినపల్లి కుర్మ సంఘం సభ్యులు

బోయినపల్లి: బోయినపల్లి గ్రామ కుర్మ సంఘం నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గుంటి తిరుపతి, ఉపాధ్యక్షుడిగా కోరె కొమురయ్య, కార్యదర్శిగా గుంటి లక్ష్మణ్, సంయుక్త కార్యదర్శిగా సంబ కొమురయ్య, కోశాధికారిగా బండారి రాజమల్లు, కార్యవర్గ సభ్యులుగా గుంటి ఎల్లయ్య, గుంటి కొమురయ్య, గుంటి గంగయ్య, గుంటి మల్లయ్య, సంబ కొమురయ్య, గుంటి నర్సయ్య, నాగం మల్లేశం, సంబ కొమురయ్య ఎన్నికయ్యారు.

మున్నూరు కాపు సంఘం..


తడగొండ మున్నూరు కాపు సంఘం సభ్యులు

తడగొండ గ్రామ శ్రీరాజరాజేశ్వర మున్నూరు కాపు సంఘం నూతన కార్యవర్గం ఎన్నికలు గురువారం నిర్వహించారు. అధ్యక్షుడిగా మినుకుల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా ఎర్ర రవి, ప్రధాన కార్యదర్శిగా భీమ తిరుపతి, కార్యదర్శిగా చేపూరి వెంకటేశ్, కోశాధికారిగా మధు ఎన్నికయ్యారు.

పోతుగల్..

ముస్తాబాద్: పోతుగల్ గ్రామ మున్నూరు కాపు పటేల్ సంఘం ఎన్నికలు గురువారం జరిగాయి. అధ్యక్షుడిగా వరి లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శిగా ఆది లక్ష్మణ్, కోశాధికారిగా భిక్షపతి, సంయుక్త కార్యదర్శిగా రాజు, కార్యవర్గ సభ్యులుగా ముత్యం, ప్రతాప్, ధర్మేందర్ ఎన్నికయ్యారు.

విద్యుదాఘాతంతో దుకాణం దగ్ధం


కాలిపోయిన దుకాణం

ముస్తాబాద్(సిరిసిల్ల): ముస్తాబాద్ మండలకేంద్రంలో బుధవారం రాత్రి విద్యుదాఘాతంతో ఫొటోస్టూడియో, గిఫ్ట్ ఆర్టికల్ దుకాణం దగ్ధమైంది. బందనకల్ గ్రామానికి చెందిన కొమ్మట శ్రీకాంత్ దుకాణం నిర్వహిస్తున్నాడు. బుధవారం రాత్రి దుకాణానికి తాళం వేసి ఇంటికి వెళ్లాడు. గురువారం ఉదయం వచ్చేసరికి కాలిపోయి కనిపించింది. దుకాణంలోని విద్యుత్ తీగల నుంచి షార్ట్ సర్క్యూట్ జరిగినట్లు భావిస్తున్నారు. దుకాణంలోని కంప్యూటర్, కెమెరాలు, గిఫ్ట్ ఆర్టికల్స్ కాలిపోయాయని, రూ.6లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. బాధితుడిని ప్రభుత్వం ఆదుకోవాలని ఫొటోగ్రాఫర్లు కోరారు.

సాయి ఆలయంలో ప్రత్యేక పూజలు



బోయినపల్లి: స్తంభంపల్లి గ్రామ సాయిబాబా ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు ఉదయం నుంచే స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. సాయిబాబా ట్రస్ట్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

సంక్షిప్త వార్తలు

వెంకట్‌రెడ్డి విగ్రహాన్ని ఏర్పాటు చేయండి

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండల కేంద్రానికి చెందిన మాజీ ఎంపీపీ, ప్రజాసేవలో అమరుడైన నేవూరి వెంకట్‌రెడ్డి విగ్రహాన్ని ఎల్లారెడ్డిపేటలో ఏర్పాటు చేయాలని బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు బండారి బాల్‌రెడ్డి కోరారు. ఈమేరకు ఎల్లారెడ్డిపేట మేజర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి దేవరాజుకు గురువారం వినతిపత్రం అందజేశారు. విగ్రహ ఏర్పాటు విషయమై బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, మాజీ జెడ్పీటీసీ వద్నాల నర్సయ్య స్పందించాలని కోరారు.

అభివృద్ధి పనుల పరిశీలన

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలోని సీహెచ్‌సీలో రూ.7లక్షల నిధులతో కొనసాగుతున్న అభివృద్ధి పనులను తాజా మాజీ ఉప సర్పంచ్ ఒగ్గు రజితయాదవ్, కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి వంగ గిరిధర్‌రెడ్డి పరిశీలించారు. ఆరోగ్య కేంద్రంలో ఫార్మసీ స్టోర్, మూత్రశాలల నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. మరో పక్షం రోజుల్లో పనులు పూర్తయి ఆసుపత్రికి వచ్చే వారికి అందుబాటులోకి వస్తాయని తెలిపారు. మాజీ ఎంపీటీసీ బాలరాజు యాదవ్, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వైద్యుడు బాబు ఉన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

ముస్తాబాద్(సిరిసిల్ల): కార్యకర్తలకు బీఆర్‌ఎస్ అండగా ఉంటుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య పేర్కొన్నారు. మండలంలోని చీకోడుకు చెందిన కార్యకర్త బైతి పర్శరాములు అనారోగ్యంతో మృతి చెందగా.. ఆయన కుటుంబాన్ని ఆగయ్య గురువారం పరామర్శించారు. పార్టీ పరంగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. సీనియర్ నాయకులు గోపాల్‌రావు బాధిత కుటుంబానికి రూ.10వేలు ఆర్థిక సాయం అందించారు. ఎంపీటీసీ సవిత, మండలాధ్యక్షుడు సురేందర్‌రావు, మాజీ సర్పంచులు రాజయ్య, శ్రీనివాస్, నాయకులు ఆంజనేయులు, దేవేందర్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీని ఓడించాలి

సిరిసిల్లటౌన్: దేశంలో మతోన్మాద శక్తులను పూర్తిగా ఎదుర్కొంటామని ఆల్ ట్రేడ్ యూనియన్స్ ప్రతినిధులు స్పష్టం చేశారు. గురువారం కలెక్టర్, వైద్యారోగ్యం, సంక్షేమ, లేబర్, విద్యాశాఖల జిల్లా అధికారులకు సార్వత్రిక సమ్మె నోటీసును అందించి మాట్లాడారు. కేంద్రంలో అధికారంలో ఉన్న మోడీ సర్కారు కార్మిక, కర్షకులు, ఉద్యోగుల వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని ఆరోపించారు. ఈనెల 16న దేశవ్యాప్తంగా చేపడుతున్న సమ్మెలో అన్ని రంగాల కార్మిక, కర్షక, ఉద్యోగులు పాల్గొంటున్నారన్నారు. కేంద్రంలో బీజేపీని అధికారం నుంచి గద్దె దింపాలని ప్రజలను కోరారు. జిల్లా ఆల్ ట్రేడ్ యూనియన్స్ ప్రతినిధులు కోడం రమణ, కడారి రాములు, జిందం ప్రసాద్, గాజుల సాగర్ తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ చర్చకు సిద్ధమా..

ముస్తాబాద్: నీళ్లు అమ్ముకునే వ్యక్తిని జెడ్పీటీసీని చేశామని, కుటుంబంలో ఒకరికి మెడికల్ సీటు ఇప్పించామని పేర్కొన్న బీఆర్‌ఎస్ నాయకులు ప్రజాకోర్టులో బహిరంగ చర్చకు రావాలని ముస్తాబాద్ జెడ్పీటీసీ గుండం నర్సయ్య సవాల్ విసిరారు. మండల కాంగ్రెస్ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరిన తనపై అనవసర ఆరోపణలు చేస్తున్నారన్నారు. జిల్లా కార్యదర్శి మిర్యాల్‌కార్ శ్రీనివాస్, వేణు, రాంరెడ్డి, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

‘పది’ విద్యార్థులకు ‘గోరుముద్ద’

గంభీరావుపేట: నాగంపేట జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో గోరుముద్ద కార్యక్రమంలో భాగంగా పదోతరగతి చదువుతున్న విద్యార్థులకు అల్పాహారం అందించేందుకు గొల్లపల్లికి చెందిన ప్రముఖ వైద్యుడు కొండ ఆంజనేయులుగౌడ్ అనే దాత ముందుకొచ్చారు. గురువారం గోరుముద్ద కార్యక్రమాన్ని పాఠశాలలో ఆయన చేతులమీదుగా ప్రారంభించారు. ఆయనకు ఉపాధ్యాయులు, విద్యార్థులు సన్మానం చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాల ఎల్లయ్య, ఎంపీటీసీ నాగభూషణం, విద్యాకమిటీ చైర్మన్ రాజు, నాయకుడు ఎల్లం, త్రినేత్ర స్వచ్ఛంద సంస్థ సభ్యుడు బిట్ల దేవరాజు పాల్గొన్నారు.

అధికార గర్వంతో విర్రవీగుతున్నారు

ఎల్లారెడ్డిపేట: నేను ప్రజల చేత ఎన్నికైన ప్రజాప్రతినిధిని అని, ఊరికే రాజకీయాల్లోకి రాలేదని ఎల్లారెడ్డిపేట ఎంపీపీ పిల్లి రేణుక పేర్కొన్నారు. అధికారం వచ్చిందన్న గర్వంతో కాంగ్రెస్ నాయకులు ప్రొటోకాల్ పాటించడం లేదన్నారు. ఎంపీపీ అయిన తనను మాట్లాడకుండా చేయడం సిగ్గుచేటన్నారు. స్థానిక జెడ్పీటీసీ ఆఫీస్ ఎదుట గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మూడు రోజుల క్రితం మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరైన సభలో ప్రొటోకాల్ పాటించలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు అనుచిత వ్యాఖ్యలు చేస్తూ బీఆర్‌ఎస్ పార్టీపై నెట్టడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో చేసిన అభివృద్ధి పనులకు ఇప్పుడు మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభోత్సవం చేస్తున్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు, జెడ్పీ కో–ఆప్షన్ సభ్యుడు చాంద్‌పాషా, సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, పార్టీ పట్టణాధ్యక్షుడు బండారి బాల్‌రెడ్డి, ఎంపీటీసీ మామిండ్ల తిరుపతి, సీనియర్ నాయకులు అందె సుభాష్, ఎడ్ల సందీప్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్లేట్లు అందజేత

కోనరావుపేట: ధర్మారం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పూర్వ విద్యార్థులు మధ్యాహ్న భోజన ప్లేట్లు అందజేశారు. పాఠశాలలో 2004లో పదోతరగతి చదివిన విద్యార్థులు 80 మంది విద్యార్థులకు ప్లేట్లు అందజేశారు.

సర్పంచులకు సన్మానం


మండెపల్లి పాలకవర్గానికి సన్మానం

సిరిసిల్ల/ఎల్లారెడ్డిపేట/కోనరావుపేట: జిల్లాలో జనవరి 31తో పదవీకాలం ముగిసిన సర్పంచులు, పాలకవర్గాలను గ్రామస్తులు గురువారం సన్మానించారు. ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లిలో గ్రామ సర్పంచ్ పాశం సరోజన, ఉప సర్పంచ్ పెంజర్ల దేవయ్య, వార్డు సభ్యులను గ్రామస్తులు సన్మానించారు. కోనరావుపేట సర్పంచ్ గంగాధర్, ఉప సర్పంచ్ దేవరాజు, వార్డు సభ్యులను గ్రామస్తులు సన్మానించారు. కోనరావుపేట మండలం మామిడిపల్లి, ధర్మారం, నాగారం గ్రామాల్లో ఐదేళ్ల పదవీకాలాన్ని పూర్తి చేసుకున్న సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులకు సన్మానం నిర్వహించారు.

ఆత్మీయ వీడ్కోలు

తంగళ్లపల్లి: గ్రామ పంచాయతీల్లో పాలకవర్గం బాధ్యతలు ముగిసిన సందర్భంగా మండెపల్లి పాలకవర్గానికి గురువారం సర్పంచ్ గణప శివజ్యోతి ఆధ్వర్యంలో ఆత్మీయ వీడ్కోలు పలికారు. పాలకవర్గ సభ్యులను శాలువాతో సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ఎంపీటీసీ బుస్స స్వప్న, ఉప సర్పంచ్ ధర్మారెడ్డి రాములు, పంచాయతీ కార్యదర్శి రాఘవరెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ దేవయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు మధ్యాహ్న భోజనం

వేములవాడఅర్బన్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని విద్యార్థులకు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆదేశాల మేరకు దాతల సహకారంతో 24 రోజులు మధ్యాహ్న భోజనం నిర్వహించనున్నట్లు తెలిపారు. గురువారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సాగరం వెంకటస్వామి ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. కూరగాయల కొమురయ్య, కనికరపు రాకేశ్, నాగుల రాము, శ్రీధర్, అరుణ్‌తేజచారి, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

బహుమతులు అందజేత

వీర్నపల్లి: గర్జనపల్లిలో గణతంత్ర దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఆటల పోటీల్లో గెలుపొందిన అంగన్‌వాడీ చిన్నారులకు సర్పంచ్ కరుణ రంజిత్ బహుమతులను అందజేశారు.